

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

విజయవాడ గురువారం 20-08-2026 సంపుటి: 02 సంచిక : 48 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Thursday 20-08-2026 Volume :02 Issue: 48 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani





Contact Number
9059328777


## జమ్మూ-కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే

- అమెరికన్లకు ప్రయాణ అడ్వైజరీని పునఃసమీక్షిస్తాం
- భద్రత కల్పనలో కేంద్రం, స్థానిక ప్రభుత్వం భేష్
- అమెరికా రాయబారి సెర్గియో గోర్ వ్యాఖ్య
- జమ్మూ-కాశ్మీర్, లడఖ్‌లలో గోర్ రెండు రోజుల పర్యటన

02

అమెరికా రాయబారి సెర్గియో గోర్ చేసిన వ్యాఖ్యలు జమ్మూ-కాశ్మీర్ విషయంలో భారత్ వైఖరికి అంతర్జాతీయ స్థాయిలో మరింత బలం చేకూర్చాయి. కాశ్మీర్ భారతదేశానికి విడదీయరాని భాగమని స్పష్టం చేసిన ఆయన, లోయలో భద్రతా పరిస్థితులు గణనీయంగా మెరుగుపడ్డాయని కొనియాడారు. కేంద్ర, స్థానిక ప్రభుత్వాల చర్యలను ప్రశంసిస్తూ అమెరికా ప్రయాణ అడ్వైజరీని పునఃసమీక్షించే అవకాశాన్ని సూచించారు. కాశ్మీర్ అందాలు, శాంతి భద్రతలపై వ్యక్తం చేసిన విశ్వాసం భారత్ సాధించిన పురోగతికి అంతర్జాతీయ గుర్తింపుగా భావిస్తున్నారు.





02

## ఇమ్రాన్‌ఖాన్‌ను కలిసిన భార్య, సోదరి..

- తొమ్మిది నెలల తర్వాత ఇమ్రాన్‌ను కలిసిన కుటుంబ సభ్యులు
- అడియాలా జైలులో భార్య, సోదరికి అనుమతి
- ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన బుష్రా బిబి
- ఇమ్రాన్ అనారోగ్యంపై కొనసాగిన ఆందోళనలు
- కుటుంబ సభ్యుల భేటీకి సుప్రీంకోర్టు ఆదేశాలు
- వారానికోసారి కలిసేందుకు కోర్టు అనుమతి
- ఫోన్ ద్వారా సంప్రదింపులకూ గ్రీన్‌సిగ్నల్
- ఆస్పత్రికి తరలించాలని పాక్ సుప్రీంకోర్టు సూచన
- జైలు అధికారులతో చికిత్స అంశంపై చర్చ
- ఈ ఏడాదిలో తొలిసారి కుటుంబ సభ్యుల భేటీ



## విదేశాలకు వెళ్లిన సీఎం

- 11 రోజుల పాటు పర్యటన
- యూకే, యూఎస్‌లో దిగ్గజ పారిశ్రామికవేత్తలతో భేటీలు
- అధికారికంగా పలు సమావేశాలు.. విశ్వ విద్యాలయాల్లో భేటీలు

న్యూఢిల్లీ

ముఖ్యమంత్రి రేవంత్ విదేశీ పర్యటన ఖరారైంది. బుధవారం ఢిల్లీలో జ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మావేశానికి హాజరైనా సాయంత్రం బ్రిటన్ పర్యటనకు వెళ్లారు మొత్తం 11 రోజుల పాటు సాగే ఈ పర్యటనలో అధికారికంగా పలు సమావేశాలు.. విశ్వ విద్యాలయాల్లో భేటీలు జరగనున్నాయి. ఈ పర్యటనలో భాగంగా యూకే, యూఎస్ లో దిగ్గజ పారిశ్రామికవేత్తలతో సీఎం సమావేశమై.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, పలువురు ఉన్నతాధికారులు కూడా సీఎం తో పాటు వెళ్తున్నారు. 11 రోజుల పర్యటన అనంతరం ఈనెల 30న వారు హైదరాబాద్‌కు

-మిగతా 2 లో

# గ్రూప్-1లో అక్రమాల బాగోతం

## అర్హత లేనివారితో పేపర్లు దిద్దించారు

- ప్రతిభను పక్కనబెట్టి పైరవీలకు పెద్దపీట
- గ్రూప్-1 అభ్యర్థుల జీవితాలతో ఆటలా?
- హైకోర్టు ఆదేశాలూ బేఖాతర్
- డిజిటల్ నుంచి మాన్యువల్ వరకు అంతా గందరగోళమే
- వ్యవస్థలను నిర్వీర్యం చేశారు యువత భవిష్యత్తుతో చెలగాటమా?
- అసెంబ్లీలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

అమరావతి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలు, నియామక ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోపించారు. అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వకుండా, వ్యవస్థలను ఇష్టానుసారంగా నడిపారని విమర్శించారు. గ్రూప్-1 అభ్యర్థుల జీవితాలతో ఆడుకోవడం కంటే తీవ్రమైన తప్పు మరొకటి ఉండదని అన్నారు. బుధవారం శాసనసభలో గ్రూప్-1 నియామకాలపై సీఎం చంద్రబాబు సుదీర్ఘంగా మాట్లాడారు. 2019-2024 మధ్య రాష్ట్రంలో వ్యవస్థలను నిర్వీర్యం చేసే విధంగా పాలన సాగిందని, ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. గ్రూప్-1 పరీక్షలకు 1.14 లక్షల మంది

-మిగతా 2లో





02

## యూఏఈపై ఇరాన్ మిస్సైల్ దాడి..


- ఇరాన్‌తో అన్ని వ్యాపార, వాణిజ్య ఒప్పందాలు రద్దు
- మిస్సైల్ దాడుల ఆరోపణల నేపథ్యంలో కీలక నిర్ణయం
- షిప్పింగ్ మార్గాలే లక్ష్యంగా దాడులంటూ ఆరోపణ
- సరిహద్దు జలాల్లో పడిన క్షిపణితో ఆందోళన
- ఆరోపణలను ఖండించిన ఇరాన్ విదేశాంగ శాఖ
- ప్రాంతీయ భద్రతకు ముప్పుగా మారుతున్న ఉద్రిక్తతలు
- యూఏఈ ప్రజలకు ఎమర్జెన్సీ అలర్ట్ జారీ
- మిస్సైల్ ముప్పుపై అప్రమత్తమైన గల్ఫ్ దేశాలు
- జలసంధి నియంత్రణపై ఇరాన్, అమెరికా భిన్న వాదనలు

## ఎన్నికలకు సిద్ధంకండి..

- గెలుపే లక్ష్యంగా పని చేయండి
- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ
- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది
- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా



02



02

- ఢిల్లీకి వెళ్లి ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకునే సంస్కృతి పెరిగింది
- జాతీయ కార్యవర్గంలో రాష్ట్ర నేతలకు చోటు లేకపోవడంపై స్పందన
- 'తెలంగాణ నేతలు మారరు' అనే భావనకు అధిష్ఠానం వచ్చి ఉండొచ్చు
- నేతల మధ్య విభేదాలే అవకాశాలను దూరం చేస్తున్నాయన్న రాజాసింగ్
- స్వప్రయోజనాలు వీడి ఐక్యంగా పనిచేయాలని పిలుపు
- బెంగాల్ తరహాలో పోరాడితేనే అధికారంలోకి రావొచ్చని వ్యాఖ్య
- ఐకమత్యమే పార్టీ బలోపేతానికి మార్గమన్న ఎమ్మెల్యే
- గుర్తింపు, పదవులు కావాలంటే సమష్టి కృషి అవసరం
- అంతర్గత విభేదాలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచన

## తెలంగాణ బీజేపీ నేతల మధ్య వర్గపోరు




## కొత్త పార్టీ పెడుతున్నా

- తిరుమలలో విజయసాయి రెడ్డి కీలక ప్రకటన
- వైసీపీలోకి రీఎంట్రీపై ఊహాగానాలకు తెరదించిన విజయసాయి రెడ్డి
- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రాజకీయ భవిష్యత్‌పై వ్యాఖ్యలు
- ఈ నెలలోనే విజయవాడలో పార్టీ ప్రణాళికను వెల్లడిస్తానని స్పష్టీకరణ
- ప్రజల పక్షాన గొంతుకగా నిలుస్తానని, సరికొత్త రాజకీయానికి శ్రీకారం చుడతానని వెల్లడి

అమరావతి

మాజీ ఎంపీ వి. విజయసాయి రెడ్డి తన రాజకీయ పునః ప్రవేశంపై నెలకొన్న సందిగ్ధతకు తెరదించారు. వైసీపీలోకి తిరిగి వెళ్తారంటూ జోరుగా సాగుతున్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ, సొంతంగా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తన కొత్త పార్టీకి శ్రీవారి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విజయసాయి రెడ్డి వివరించారు. ప్రజల పక్షాన బలమైన గొంతుకను వినిపించేందుకే కొత్త పార్టీ పెడుతున్నానని స్పష్టం చేశారు. పార్టీకి సంబంధించిన పూర్తి వివరాలు, భవిష్యత్ కార్యాచరణను ఈ నెలలోనే విజయవాడలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి

-మిగతా 2 లో



## పరిస్థితి మరింత దిగజారింది

- మోడీ ప్రభుత్వాన్ని ఇంకా నమ్మొచ్చా?
- ఆగ్రహంతో దేశ యువత
- అయోధ్య విరాళాల చోరీపై ప్రధాని సమాధానం చెప్పాలి
- సరిహద్దుల్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు ప్రజలకు పారదర్శకత అవసరం
- సీడబ్ల్యూసీ భేటీలో మల్లికార్జున ఖర్గే ఎన్నికలు జరిగే ఏడు రాష్ట్రాల గురించి చర్చ

న్యూఢిల్లీ

"విద్య, రామాలయ విరాళాలు చోరీ, జాతీయ భద్రత వంటి విషయాలలో మోడీ ప్రభుత్వాన్ని ఇంకా విశ్వసించవచ్చా?" అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. బుధవారం నాడిక్కడ ఇందిరా భవన్‌లో మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరిగింది. మరోవైపు వచ్చే ఏడాది ఏడు

-మిగతా 2 లో

# 100 మున్సిపాల్స్‌కు గ్రీన్ సిగ్నల్

### బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు అమలు

- సుప్రీం తీర్పునకు అనుగుణంగా ముందుకు
- 87 పురపాలికలకు ఇప్పటికే ముగిసిన గడువు
- నవంబరుతో మరో 13 సంస్థల పదవీకాలం పూర్తి
- న్యాయపరమైన చిక్కులు తొలగగానే షెడ్యూల్ విడుదల
- ఎన్నికల సన్నద్ధతకు మున్సిపల్ శాఖ ఆదేశాలు
- ఈసారి మేయర్, చైర్మన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నిక
- కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సమీక్ష

అమరావతి,

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 100 మున్సిపాలిటీలకు త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు మొదలు పెట్టింది. ఈ మేరకు పురపాలక శాఖ ఎన్నికల సన్నద్ధతకు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని మొత్తం 123 పురపాలక సంస్థల్లో 100 చోట్ల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రక్రియపై అధికారులు దృష్టిసారించారు. వీటిలో 87 సంస్థల పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ఇప్పటికే ముగియగా, మరో 13 సంస్థల పదవీకాలం నవంబరులో

-మిగతా 2 లో



# జమ్మూ-కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే

**-అమెరికన్లకు ప్రయాణ అడ్వైజరీని పునఃసమీక్షిస్తాం**
**-భద్రత కల్పనలో కేంద్రం, స్థానిక ప్రభుత్వం భేష్**
**-అమెరికా రాయబారి సెర్గియో గోర్ వ్యాఖ్య**
**-జమ్మూ-కాశ్మీర్, లడఖ్‌లలో గోర్ రెండు రోజుల పర్యటన**



శ్రీనగర్:
జమ్మూ-కాశ్మీర్ పైన భారత్ స్థిరమైన వైఖరికి పెద్ద మద్దతు ఇస్తూ, ఇది భారత్‌కు ముఖ్యమైన అంతర్భాగమని అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు. జమ్మూ-కాశ్మీర్, లడఖ్‌లకు రెండు రోజుల పర్యటన కోసం బుధవారం శ్రీనగర్ చేరుకున్న తర్వాత ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాశ్మీర్ భారతదేశం ముఖ్యమైన భాగం. నేను ఈ ప్రాంతాన్ని మొదటిసారి సందర్శిస్తున్నాను. ఇది అత్యంత అందమైన ప్రదేశం.మా సమావేశం చాలా స్నేహపూర్వకంగా జరిగింది. మేము మా సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఆశిస్తున్నాము అని గోర్ చెప్పారు. గత సంవత్సరం జరిగిన ఆపరేషన్ సింధూర్ తర్వాత కాశ్మీర్ కు వచ్చిన మొదటి అమెరికా అత్యున్నత దౌత్యవేత్తగా ఆయన నిలిచారు. ఆయన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు దక్షిణ, మధ్య ఆసియా ప్రత్యేక ప్రతినిధిగా కూడా పనిచేస్తున్నారు. గోర్ అత్యంత ముఖ్యమైన వ్యాఖ్యలలో ఒకటి ఈ ప్రాంతం కోసం అమెరికా ప్రయాణ అడ్వైజరీపై వచ్చింది. వాషింగ్టన్ తన ప్రయాణ హెచ్చరికలను క్రమం తప్పకుండా సమీక్షిస్తుందని గోర్ చెప్పారు. జమ్మూ-కాశ్మీర్ కోసం ఉన్న అడ్వైజరీని పునఃపరిశీలించవచ్చని సూచించారు. కాశ్మీర్ లోయలో మెరుగుపడుతున్న భద్రతా పరిస్థితిని ప్రశంసిస్తూ అమెరికా పౌరులకు జారీ చేసిన సలహా పునఃసమీక్షపై ఏ పెద్ద ప్రకటన చేయలేనని అయితే అమెరికా ప్రభుత్వం దానిని పరిశీలించవచ్చని గోర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి, స్థానిక ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని మరింత సురక్షితంగా ఉంచడానికి, భద్రతను పెంచడానికి అద్భుతమైన చర్యలు తీసుకున్నాయని మేము నమ్ముతున్నాము. అందువల్ల అమెరికా సిఫార్సు చేసిన ప్రయాణ హెచ్చరిక స్థాయిని తగ్గించాలా వద్దా అని మేము పరిశీలిస్తాము అని ఆయన అన్నారు. ఇది అందమైన ప్రాంతం. చాలా మంది అమెరికన్లు ఇక్కడకు వచ్చి దాని అందాన్ని చూసి ఆనందిస్తారని నేను అనుకుంటున్నాను అని ఆయన అన్నారు.

# విదేశాలకు వెళ్లిన సీఎం

మొదటి తరువాయి

చేరుకుంటారు. యూకే పర్యటనలో భాగంగా ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ మరియు లండన్ యూనివర్సిటీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి భేటీ కానున్నారు. అలాగే, ప్రసిద్ధ బ్లావత్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నెన్స్‌ను సందర్శించడంతో పాటు, ఎమిరేట్స్ స్టేడియంలో జరిగే ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్ ఫుట్‌బాల్ ప్రెజెంటేషన్‌కు హాజరవుతారు.

వరుస సమావేశాలు.. నిర్ణయాలు

ఈ నెల 23న ఆగస్టు 23న ఆయన అమెరికాకు పయనం కానున్నారు. అమెరికాలో హార్వర్డ్, ఎంఐటీ క్యాంపస్‌ల సందర్శన అమెరికాలో తన పర్యటనలో భాగంగా బోస్టన్ లోని ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ మరియు ఎంఐటీ క్యాంపస్‌లను సీఎం సందర్శిస్తారు. అంతేకాకుండా, నార్త్ ఈస్టర్న్ మరియు వర్జీనియా టెక్ యూనివర్సిటీల ప్రతినిధులతో చర్చలు జరుపుతారు. న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఏర్పాటు చేసే ప్రత్యేక 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో ప్రవాస భారతీయులను కలుసుకుంటారు. ఈ విదేశీ పర్యటనలో అత్యంత కీలకమైన ఘట్టంగా ఆగస్టు 27, 28 తేదీల్లో గ్లోబల్ సీఈఓలు, వెంచర్ క్యాపిటలిస్టులు మరియు బహుళజాతి సంస్థల అధిపతులతో పారిశ్రామిక రౌండ్‌టేబుల్ సమావేశాలు జరగనున్నాయి. ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్లు మరియు మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో భారీ పెట్టుబడులను సాధించడమే లక్ష్యంగా సీఎం ఈ చర్చలు నిర్వహించనున్నారు.

# ఎన్నికలకు సిద్ధంకండి..

**-గెలుపే లక్ష్యంగా పని చేయండి**
**- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ**
**- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది**
**- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా**



**అమరావతి**

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్ ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు. వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

# పరిస్థితి మరింత దిగజారింది

మొదటి తరువాయి

రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా అనుసరించాల్సిన వ్యూహంపై సమీక్షించారు. ఎన్నికలు జరిగే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, గోవా, మణిపూర్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన అంశాలపై కూడా చర్చించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ... ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, గోవా, మణిపూర్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాల్లో ఎన్నికలకు పార్టీ సన్నద్ధమవుతున్న తరుణంలో, సీడబ్ల్యూసీ ఈ అంశాలపై చర్చించి దేశం ముందు "ప్రత్యామ్నాయం, విధానం, పరిష్కారాలను" ఉంచాలని ఖర్గే అన్నారు. "మన పోరాటం ఎప్పుడూ కేవలం రాజకీయ అధికారం కోసం మాత్రమే సాగలేదు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, భారత రాజ్యాంగాన్ని నిలబెట్టడం, అలాగే భారత ప్రజల కోసం, ఈ దేశాన్ని వారసత్వంగా పొందబోయే తరాల కోసం మెరుగైన భవిష్యత్తును నిర్మించడం కోసం సాగిన పోరాటం అది" అని ఆయన సూచించారు. ఈ ప్రభుత్వ విధానాలతో దేశ యువత నిరాశ, నిస్పఅహలకు లోనతున్నారని అన్నారు.


# గ్రూప్-1లో అక్రమాల బాగోతం

మొదటి తరువాయి

అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని చంద్రబాబు తెలిపారు. పరీక్షల అనంతరం 326 మందిని ఇంటర్వ్యూకు పిలిచి, చివరకు 165 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని చెప్పారు. సివిల్స్, గ్రూప్ వంటి పరీక్షలు ఎంతో మంది విద్యార్థుల జీవితాశయాలని సీఎం పేర్కొన్నారు. ఇలాంటి పరీక్షల్లో ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యంలో అంగీకరించలేమన్నారు. గ్రూప్-1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకన ప్రక్రియలో అనేక దశల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు సీఎం ఆరోపించారు. గ్రూప్-1 పరీక్షలను 17 దశల్లో నిర్వహించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టారని తెలిపారు. పేపర్ల మూల్యాంకనం విషయంలో హైకోర్టు మాన్యువల్ ఎవాల్యుయేషన్ చేయాలని, డిజిటల్ ఎవాల్యుయేషన్ వద్దని చెప్పిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. అయితే ఆదేశాలు, నిబంధనలను పట్టించుకోకుండా పలు విధానాల్లో పేపర్లను మూల్యాంకనం చేశారని ఆరోపించారు. మొదటి దశలో గ్రూప్-1 జవాబు పత్రాల డిజిటల్ మూల్యాంకనాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారని చంద్రబాబు తెలిపారు. ఇందుకోసం ఒక ప్రైవేట్ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారని చెప్పారు. ఆ తర్వాత రెండో దశలో హాయ్‌లాండ్‌లో మాన్యువల్ ఎవాల్యుయేషన్ చేయించారని వివరించారు. హైదరాబాద్‌లో పేపర్లు దిద్దిన వారిలో 25 మంది అనర్హులు ఉన్నారని, రెండోసారి హాయ్‌లాండ్‌లో పేపర్లు దిద్దిన 66 మంది కూడా అనర్హులేనని సీఎం పేర్కొన్నారు. గ్రూప్-1 వంటి అత్యంత కీలక పరీక్ష పేపర్ల మూల్యాంకన బాధ్యతలను అర్హత లేని వ్యక్తులకు అప్పగించారని చంద్రబాబు తీవ్రంగా ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికులు, డ్రైవర్లు, ప్లంబర్లతో కూడా పేపర్లు దిద్దించారని ఆయన అన్నారు. మొత్తం 166 మంది ఎవాల్యుయేటర్లలో కేవలం 50 మంది డిగ్రీ లెక్చరర్లను మాత్రమే ఉపయోగించారని తెలిపారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు చేయాల్సిన పనిని కార్మికులతో చేయించడం ఏ విధమైన వ్యవస్థ అని ప్రశ్నించారు. ఏపీపీఎస్సీ ఛైర్మన్‌ను కట్టడి చేసి నిస్సహాయుడిగా మార్చారని సీఎం ఆరోపించారు. సీఎం ఇంటెలిజెన్స్ అధికారికి సెక్రటరీ పోస్టు ఇచ్చారని, శ్రీకాళహస్తి మహంకాళి రఘురామ్‌ను నియమించారని పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఆమోదం లేకుండా ఎలాంటి కీలక పని చేయకూడదని నిబంధనలు ఉన్నాయని, వాటిని కూడా ఉల్లంఘించారని చంద్రబాబు అన్నారు. గ్రూప్-1 పేపర్ల మూల్యాంకనానికి సంబంధించిన సమాచారాన్ని ఈమెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సాప్ వంటి మార్గాల్లో షేర్ చేసుకున్నారని సీఎం ఆరోపించారు. పేపర్లను దిద్దే విధానంలో మార్పులు, మార్కుల పెంపు, తగ్గింపు వంటి వాటిని ఇష్టానుసారంగా చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. మొదట హైదరాబాద్‌లో, ఆ తర్వాత హాయ్‌లాండ్‌లో పేపర్లు దిద్దించడం వెనుక కారణాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 జవాబు పత్రాల్లో తప్పులను సరిచేయడానికి ఫ్లూయిడ్ ఉపయోగించకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ 55 చోట్ల ఫ్లూయిడ్‌తో తప్పులు సరిచేసినట్లు సీఎం తెలిపారు. అలాగే 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ షీట్లను ప్రింట్ చేశారని పేర్కొన్నారు. గ్రూప్-1 పరీక్ష రాసిన ఒక లెక్చరర్‌ను కూడా తిరిగి పేపర్లు దిద్దేందుకు పిలిచారని చంద్రబాబు ఆరోపించారు. గ్రూప్-1 వ్యవహారంలో కోర్టులను పక్కదారి పట్టించేలా తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేయించారని సీఎం ఆరోపించారు. ఖర్చుల కోసం రూ. 1.14 కోట్లు ఇచ్చినట్లు కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారని చెప్పారు. ఈ వ్యవహారంపై హైకోర్టు ఆదేశాలతో సిట్ ఏర్పాటు చేసిన విషయాన్ని కూడా సీఎం ప్రస్తావించారు. ఏపీపీఎస్సీ నియమాలు, నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారని, దర్యాప్తు నివేదికలను పరిశీలిస్తే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుందని చంద్రబాబు అన్నారు. గ్రూప్-1 వంటి ప్రతిష్టాత్మక పరీక్ష పేపర్ల మూల్యాంకన బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడంపై ప్రాథమికంగా తప్పని సీఎం అభిప్రాయపడ్డారు. వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తే ఎవరూ తప్పు చేయలేరని అన్నారు. పరీక్షల నిర్వహణకు స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని ఎందుకు పాటించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలు మరోసారి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చంద్రబాబు అన్నారు. "ప్రతిభకు పట్టం కట్టాలి.. పైరవీలకు దూరంగా ఉండాలి" అని స్పష్టం చేశారు. ఇలాంటి తప్పులు చేసిన వారు భయపడేలా శిక్షలు ఉండాలని అన్నారు. సివిల్స్, గ్రూప్ వంటి పరీక్షలు యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయని, వాటిలో అక్రమాలకు తావిస్తే విద్యార్థుల్లో వ్యవస్థలపై నమ్మకం పోతుందని సీఎం పేర్కొన్నారు. గ్రూప్-1 వ్యవహారంపై బాధ్యులు వివరణ ఇవ్వాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. "ఇలాంటి తప్పులు ఎందుకు చేశారు? మీరు చేసింది సరైందే అని చెప్పే దమ్ము, ధైర్యం ఉందా?" అంటూ ప్రశ్నించారు. గ్రూప్-1 నియామకాల్లో ప్రతిభకు న్యాయం జరగాలని, భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితుల్లోనూ రాజకీయ, వ్యక్తిగత లేదా ఇతర ప్రభావాలకు అవకాశం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోందని సీఎం స్పష్టం చేశారు. యువత భవిష్యత్తుతో ముడిపడిన నియామక పరీక్షల విషయంలో ఒక్క చిన్న అనుమానం కూడా లేకుండా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చంద్రబాబు వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

# యూఏఈపై ఇరాన్ మిస్సైల్ దాడి..

**-ఇరాన్‌తో అన్ని వ్యాపార, వాణిజ్య ఒప్పందాలు రద్దు**
**-మిస్సైల్ దాడుల ఆరోపణల నేపథ్యంలో కీలక నిర్ణయం**
**-షిప్పింగ్ మార్గాలే లక్ష్యంగా దాడులంటూ ఆరోపణ**
**-సరిహద్దు జలాల్లో పడిన క్షిపణితో ఆందోళన**
**-ఆరోపణలను ఖండించిన ఇరాన్ విదేశాంగ శాఖ**
**-ప్రాంతీయ భద్రతకు ముప్పుగా మారుతున్న ఉద్రిక్తతలు**
**-యూఏఈ ప్రజలకు ఎమర్జెన్సీ అలర్ట్ జారీ**
**-మిస్సైల్ ముప్పుపై అప్రమత్తమైన గల్ఫ్ దేశాలు**
**-హార్ముజ్ జలసంధిపై కొనసాగుతున్న ప్రతిష్ఠంభన**
**-జలసంధి నియంత్రణపై ఇరాన్, అమెరికా భిన్న వాదనలు**



**హైదరాబాద్**

ఇరాన్ యుద్ధం ఇంకా కొనసాగుతున్న వేళ పొరుగునే ఉన్న యూఏఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్‌తో ఉన్న అన్ని వ్యాపార, వాణిజ్య ఒప్పందాల్ని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. తాజా యుద్ధం నేపథ్యంలో ఇరాన్ తమపై వరుసగా మిస్సైల్ దాడులకు దిగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బుధవారం వెల్లడించింది. "యూఎస్-ఇరాన్ యుద్ధం కారణంగా స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో ఇరాన్‌తో అన్ని రకాల వాణిజ్య, వ్యాపార, ఆర్థిక ఒప్పందాల్ని రద్దు చేసుకుంటున్నాం.తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ నిర్ణయం అమలవుతుంది" అని ఇరాన్ విదేశాంగా శాఖ ప్రకటించింది. ఇరాన్ వరుసగా చేస్తున్న మిస్సైల్ దాడులే ఇరాన్ ఈ నిర్ణయం తీసుకునేందుకు కారణం. యూఏఈ సహా గల్ఫ్ దేశాలకు చెందిన షిప్పింగ్ రూట్లపై ఇరాన్ వరుసగా బాలిస్టిక్ మిస్సైళ్లతో దాడి చేస్తోంది. అయితే, యూఏఈలో ఉన్న డిఫెన్స్ సిస్టమ్స్ వాటిని గుర్తించి ధ్వంసం చేస్తున్నాయి. తాజాగా ఒక మిస్సైల్ యూఏఈ సరిహద్దు జలాల్లో పడగా, ఇంకోటి దేశంలోనే పడింది. తమ నౌకా మార్గాన్ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడికి దిగిందని యూఏఈ వెల్లడించింది. అయితే, ఈ ఆరోపణలను ఇరాన్ ఖండించింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఎస్మాయెలి బకాయే ఈ ఆరోపణల్ని కొట్టిపారేశారు. ఇవి ఆధారం లేని ఆరోపణలు అని, వీటివల్ల ప్రాంతీయ విశ్వాసం దెబ్బతింటుందని ఎస్మాయెలి అన్నారు.ఈ అంశంపై యూఏఈ ప్రకటన చేసిన కొద్దిసేపటికే అక్కడి ప్రజలకు ఎమర్జెన్సీ అలర్ట్ వచ్చింది. మిస్సైల్ దాడికి అవకాశం ఉందని, ప్రజలు సురక్షితంగా ఇండ్లలోనే ఉండాలని ఆ అలర్ట్ సారాంశం. అయితే, కొంతసేపటికే ఆ అలర్ట్‌ను అధికారులు ఎత్తివేశారు. మరోవైపు హార్ముజ జలసంధి విషయంలో ఇంకా ఉద్రిక్తత కొనసాగుతోంది. అమెరికాతో ఒప్పందం కుదిరే వరకు జలసంధి మూసి ఉంటుందని ఇరాన్ ప్రకటించింది. అయితే, జలసంధి తమ ఆధీనంలోనే ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

# ఇమ్రాన్‌ఖాన్‌ను కలిసిన భార్య, సోదరి..



**న్యూఢిల్లీ**


పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను ఆయన భార్య, సోదరి కలిశారు. తొమ్మిది నెలల తర్వాత ఇమ్రాన్‌ను కుటుంబ సభ్యులు కలిశారు. ఈ ఏడాది తొలిసారి. రావల్పిండిలోని అడియాలా జైలులో ఇమ్రాన్ ఖాన్ ఖైదీగా ఉన్నారు. అయితే, ఆయనను కలిసేందుకు కుటుంబ సభ్యుల్ని ప్రభుత్వం కొన్ని నెలలుగా అనుమతించలేదు. మధ్యలో ఆయన తరపు లాయర్లు మాత్రమే కలిశారు. దీంతో ఆయన అనారోగ్యంపై చాలావార్తలు ప్రచారంలో ఉన్నాయి.ఈ నేపథ్యంలో ఆయనకు చికిత్స అందించాలని, కుటుంబ సభ్యులు కలిసేందుకు అనుమతివ్వాలని కోరుతూ ఆయన సన్నిహితులు ఇటీవల పాక్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన కోర్టు ఇమ్రాన్‌ఖాన్‌ను వెంటనే జైలు నుంచి ఇస్లామాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించాలని ఆదేశించింది. తగిన చికిత్స అందించాలని సూచించింది. ఇదే సమయంలో వారానికోసారి కుటుంబ సభ్యులు కలిసేందుకు అనుమతించింది. అలాగే, ఫోన్ల ద్వారా కూడా నిత్యం సంప్రదించవచ్చని తెలిపింది. దీంతో 9 నెలల తర్వాత ఇమ్రాన్ భార్య బుష్రా బిబి, ఇమ్రాన్ సోదరి నోరీన్ నాజి.. బుధవారం ఇమ్రాన్ ఖాన్‌ను కలిశారు. అడియాలాలోని జైలులో కలిసి దాదాపు 15 నిమిషాలపాటు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు ఇమ్రాన్ ఆరోగ్యంపై ఆరాతీశారు. ఆయనను కోర్టు ఆదేశాల ప్రకారం షిఫా ఆస్పత్రికి తరలించే అంశంపై జైలు అధికారులతో మాట్లాడారు.కోర్టు ఆదేశాలకు అనుగుణంగా అధికారులు ఇమ్రాన్‌ను ఆస్పత్రికి తరలించే అవకాశం ఉంది. అక్కడ ఆయన సెప్టెంబర్ 16 వరకు ఉంటారని కోర్టు సూచించింది. పూర్తి చికిత్స అనంతరం వైద్యుల బృందం తగిన నివేదిక ఇవ్వాలని సూచించింది. అక్కడ చికిత్స సమయంలో ఇమ్రాన్ ఫ్యామిలీ వైద్యులు, లాయర్లను కూడా కలుసుకోనివ్వాలని ప్రభుత్వానికి సూచించింది. అవినీతి కేసులలో పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను అక్కడి షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం 2023, ఆగష్టులో అరెస్టు చేసింది. అప్పటినుంచి మూడేళ్లుగా ఆయన జైలులోనే ఉన్నారు.

# కొత్త పార్టీ పెడుతున్నా

మొదటి తరువాయి

వెల్లడిస్తానని తెలిపారు. దేశం ఎల్ నినో ప్రభావం లేకుండా సుభిక్షంగా ఉండాలని కూడా స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు. గతేడాది తన రాజ్యసభ సభ్యత్వానికి, వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన విజయసాయి రెడ్డి, ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటూ వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, కొన్ని నెలలకే ఆయన తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. రాజకీయాల్లోకి తిరిగి వస్తానని, సొంతంగా ఒక మీడియా సంస్థను కూడా ప్రారంభాన్నిస్తానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. అప్పటి నుంచి సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ పలు జాతీయ, రాష్ట్ర అంశాలపై తన అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఆయన తిరిగి వైసీపీ గూటికి చేరతారనే ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలోనే ఆయన స్పందిస్తూ.. తనది స్వతంత్ర భావజాలమని, ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా నిర్ణయం తీసుకుంటానని ట్విట్టర్ వేదికగా స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే 'భారత్ జన వికాస్' పేరుతో ఆయన పార్టీ పెట్టబోతున్నారంటూ సోషల్ మీడియాలో చర్చ జరిగింది. తాజాగా తిరుమలలో ఆయన చేసిన ప్రకటనతో ఈ ఊహాగానాలకు తెరపడింది.

# తెలంగాణ బీజేపీ నేతల మధ్య వర్గపోరు



**హైదరాబాద్**

బీజేపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణ నాయకులకు ప్రాతినిధ్యం దక్కకపోవడంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో కొనసాగుతున్న వర్గ రాజకీయాలే దీనికి ప్రధాన కారణమని ఆరోపిస్తూ, రాష్ట్ర నేతలంతా తమ వైఖరిపై ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. గతంలో రాష్ట్రానికి చెందిన సీనియర్ నేతలకు జాతీయ స్థాయిలో కీలక పదవులు దక్కేవని, కానీ ఈసారి ఒక్కరికి కూడా జాతీయ కార్యవర్గంలో చోటు కల్పించలేదని రాజా సింగ్ అన్నారు. తెలంగాణ బీజేపీలో నిరంతరం గ్రూప్ రాజకీయాలు నడుస్తున్నాయని, ప్రతి చిన్న విషయానికీ ఢిల్లీకి వెళ్లి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకునే సంస్కృతి పెరిగిపోయిందని విమర్శించారు. నాయకుల మధ్య ఉన్న ఈ తీవ్ర విభేదాల వల్లే 'తెలంగాణ నేతలు మారరు' అనే ముగింపునకు అధిష్టానం వచ్చి ఉంటుందని, అందుకే ఈ నిర్ణయం తీసుకుందని వ్యాఖ్యానించారు. అలాగే, దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందుకు జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నాయకత్వంలో ప్రత్యేక ప్రణాళికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర నేతలంతా పాత విభేదాలను, స్వయం ప్రయోజనాలను పక్కనబెట్టి, పశ్చిమ బెంగాల్ తరహాలో ఐక్యంగా పోరాడి తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఐకమత్యంతో పోరాడితేనే భవిష్యత్తులో పార్టీ అధిష్టానం తగిన గుర్తింపునిచ్చి, పదవులు కేటాయిస్తుందని స్పష్టం చేశారు.

# 100 మున్సిపాల్స్‌కు గ్రీన్ సిగ్నల్

మొదటి తరువాయి

ముగియనుంది. న్యాయపరమైన అడ్డంకులు తొలగిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు, రిజర్వేషన్లకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేసే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఓటర్ల జాబితాలు, వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు తదితర ప్రక్రియలను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

23 చోట్ల న్యాయపర చిక్కులు..

రాష్ట్రంలో 23 పురపాలక సంస్థల్లో న్యాయపరమైన వివాదాల కారణంగా ఎన్నికల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ మున్సిపాలిటీలలో న్యాయపరమైన అడ్డంకులు ఉన్నట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. సమీప గ్రామాలను పట్టణ స్థానిక సంస్థల్లో విలీనం చేయడం, వార్డులు, డివిజన్ల పునర్విభజన తదితర అంశాలపై కోర్టుల్లో కేసులు పెండింగ్ ఉండటంతో గతంలో ఆయా ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో న్యాయ వివాదాల పరిష్కారం పై ప్రభుత్వం దృష్టి పెట్టింది. కోర్టుల్లో ఉన్న అడ్డంకులను తొలగించి ఆయా మున్సిపాలిటీల్లో ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ చిక్కులు వీడిన వెంటనే ఆయా చోట్ల ఎన్నికలను నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. న్యాయపరమైన అనుమతులు లభించిన ప్రాంతాల్లో అవసరమైన పునర్విభజన ప్రక్రియను సుమారు 20 రోజుల్లో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలుస్తోంది.

ఎన్నికల సంఘం ముమ్మర కసరత్తు..

మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా కసరత్తును వేగవంతం చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా పలు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల సన్నద్ధతను సమీక్షించారు. రాష్ట్ర జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, ఎన్నికల ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంబంధిత శాఖల కమిషనర్లకు ఇప్పటికే సమాచారం ఇచ్చామని, ఎన్నికల ప్రోటోకాల్ ప్రకారం ఒక్కో ప్రక్రియను పూర్తి చేస్తామని పునేఠా పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల ప్రక్రియలో భాగంగా ఆగస్టు 17 నాటికి ఒక కీలక దశ పూర్తయినట్లు వెల్లడించారు. మేయర్, మున్సిపల్ ఛైర్మన్ల ఎంపికకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం చట్ట సవరణ కూడా చేసింది. తాజాగా ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనం 4వ సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. దీంతో ఈసారి నగరపాలక సంస్థల మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లను ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకోనున్నారు.

# సముద్రంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు



**ముమ్మిడివరం,ఆగస్టు 19, ( నేటి దర్శిని )** సముద్రంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్‌గార్డ్, నేవీ ఆధ్వర్యంలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలకు అనుగుణంగా రక్షణ చర్యలను మరింత వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శాసనసభ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి,జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చే వరకు గాలింపు చర్యలు కొనసాగుతాయని భరోసా కల్పించారు.ఆగస్టు 3న ఓడలరేవు ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ నుంచి IND-AP-E8-MO–135 ‘ముత్యాలమ్మ’ బోటులో ఏడుగురు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లారు. అనంతరం వారి ఆచూకీ తెలియకపోవడంతో సుమారు 300 నాటికల్ మైళ్ల పరిధిలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.కోస్ట్‌గార్డ్‌కు చెందిన ఐదు నౌకలు, నేవీకి చెందిన రెండు నౌకలతో పాటు నేవీకి చెందిన రెండు అత్యాధునిక విమానాల ద్వారా సముద్రంలో గాలింపు కొనసాగుతోంది. ఒడిశా, పశ్చిమ బెంగాల్, అసోం తీర ప్రాంత రక్షణ విభాగాలతో అధికారులు సమన్వయం చేస్తున్నారు.పారాదీప్‌కు సుమారు 15 నాటికల్ మైళ్ల దూరంలో ముత్యాలమ్మ పేరుతో పసుపు రంగు బోటు గుర్తించబడింది. అది గల్లంతైన మత్స్యకారులు ప్రయాణించిన బోటేనా అనే విషయాన్ని ప్రత్యేక బృందాలు పరిశీలిస్తున్నాయి.గల్లంతైన బోటులో సుమారు 1,000 లీటర్ల డీజిల్, 20 రోజులకు సరిపడా ఆహార నిల్వలు ఉన్నట్లు సమాచారం ఉంది. ప్రస్తుతం సముద్ర వాతావరణం అనుకూలంగా ఉండటంతో మత్స్యకారులు క్షేమంగా ఉండే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారుల కుటుంబ సభ్యులకు అధికారులు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తున్నారు. మత్స్యకారుల ఆచూకీ లభించి, వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చే వరకు గాలింపు మరియు రక్షణ చర్యలు ఎలాంటి విరామం లేకుండా కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు..


## --రాజుకుంట నరసింహ అభినందనలు



**చిట్వేలు, ఆగస్టు 19, ( నేటి దర్శిని )** బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని టీడీపీ యువ నాయకుడు రాజుకుంట నరసింహ స్వాగతించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు దక్కే రాజకీయ అవకాశాలను ఈ నిర్ణయం మరింత విస్తృతం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కారణంగా బీసీ వర్గాలకు చెందిన అనేకమంది నాయకులు ప్రజా ప్రతినిధులుగా ఎదిగే అవకాశం ఉంటుందని రాజుకుంట నరసింహ అన్నారు. రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు బీసీ వర్గాల సామాజిక స్థితిగతులు, ఆత్మగౌరవం మరింత బలోపేతం కావడానికి ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుకు చొరవ చూపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాజుకుంట నరసింహ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. బీసీల హక్కుల విషయంలో కూటమి ప్రభుత్వంలో తన మద్దతును కొనసాగిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్కు, విద్య, ఉపాధి రంగాల్లో బీసీ యువతకు అవకాశాల కోసం కృషి చేస్తున్న ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్కు కూడా ధన్యవాదాలు తెలియజేశారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం వల్ల స్థానిక సంస్థల్లో నిర్ణయాత్మక పాత్ర పోషించే అవకాశం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యలపై పనిచేసేందుకు ఇది ప్రోత్సాహకరమైన వాతావరణాన్ని కల్పిస్తుందని అన్నారు. 34 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణ బీసీలకు దక్కిన రాజకీయ హక్కును మరింత బలోపేతం చేసే నిర్ణయమని రాజుకుంట నరసింహ పేర్కొన్నారు. బీసీల తరపున రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయం


**- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీరశైవ లింగాయత్ /లింగ బలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుల్జాపూర్ స్వప్న హర్షం**



**గుంతకల్లు (అనంతపురం), ఆగస్టు 19, ( నేటి దర్శిని )** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీరశైవ లింగాయత్ /లింగ బలిజ రిపేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుల్జాపూర్ స్వప్న హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె బుధవారం ‘ డ్రీమ్ టైమ్స్’ ప్రతినిధితో మాట్లాడారు. బీసీ వర్గాలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం వల్ల సామాజిక, రాజకీయ సాధికారతకు ఇది చారిత్రాత్మకమైన అడుగు అని ఆమె పేర్కొన్నారు. రానున్న గ్రామపంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్న చిరకాల ఆకాంక్షను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశానికి ఆమోదం లభించడం శభపరిణామమన్నారు. అనంతరం అసెంబ్లీలో చర్చించి బిల్లు రూపొందించి రిజర్వేషన్లు అమలు చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. 1984లో ఎన్టీ రామారావు టీడీపీని స్థాపించిన అనంతరం బీసీలకు స్థానిక సంస్థల్లో 20 శాతం రిజర్వేషన్లు కల్పించారని.. అనంతరం 1995లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు.

# శ్రీ లక్ష్మీనరసింహస్వామికి నూతన రథం నిర్మాణం

**-భక్తులకు మెరుగైన వసతుల కల్పనకు దేవస్థానం చర్యలు**



**ఉరవకొండ ఆగస్టు 19, ( నేటి దర్శిని )** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రేగటి నాగరాజు తెలిపారు. ఇందులో భాగంగా స్వామివారి రథోత్సవం కోసం నూతన రథం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం ఆలయ ధర్మకర్తల మండలి సమావేశం చైర్మన్ రేగటి నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో దేవస్థాన అభివృద్ధి, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, చేపట్టాల్సిన నిర్మాణ పనులపై సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో సాకే రమేష్‌బాబు మాట్లాడుతూ.. వచ్చే ఏడాది నిర్వహించనున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవానికి అవసరమైన నూతన రథం నిర్మాణంపై చర్చించినట్లు తెలిపారు. అలాగే దేవస్థాన నిధులతో భక్తుల అవసరాలకు అనుగుణంగా వసతి గదులను దశలవారీగా నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. భక్తులు, దాతల సహకారంతో ప్రత్యేక వసతి గదుల నిర్మాణానికి అవకాశం కల్పించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు ఈవో తెలిపారు. దేవస్థాన అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి, భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారుఈ సమావేశంలో ధర్మకర్తల మండలి ఎక్స్అఫీషియో సభ్యులు ఏ.ఎన్. ద్వారకానాథ చార్యులు, సభ్యులు బొల్లినేని పద్మాక్షి, కురుబ ఇందిరమ్మ, రామకృష్ణ, బోయ ఎర్రమ్మ, చంద్ర మౌళిస్వామి, ఎం.సి. నారాయణప్ప, ధనుంజయ ఆచారి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై చిట్వేల్‌లో టీడీపీ సంబరాలు



**చిట్వేల్, ఆగస్టు 19, ( నేటి దర్శిని )** బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ చిట్వేల్‌లో టీడీపీ నాయకులు, బీసీ వర్గాల ప్రతినిధులు సమావేశమయ్యారు. మండల టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ నాయకుడు సేతు శంకరయ్య యాదవ్ మాట్లాడుతూ.. బీసీలకు రాజకీయాల్లో అవకాశాలు పెరగాలంటే రిజర్వేషన్లు కీలకమన్నారు. 34 శాతం రిజర్వేషన్లతో బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో మరింత ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉందన్నారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో టీడీపీకి ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో బీసీ వర్గాలకు పదవులు, అవకాశాలు కల్పించిన విషయాన్ని నాయకులు గుర్తు చేశారు. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన రమాదేవిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. బీసీ వర్గాలకు పార్టీ ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది ఉదాహరణగా పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కాకర్ల నాగార్జున నాయుడు, సీనియర్ నాయకులు లారీ సుబ్బారాయుడు, బాలు రామాంజనేయులు, రాయన సుబ్బారాయుడు, గుండయ్య యాదవ్, నంద్యాల ధనంజయ, దేరంగుల వెంకటేష్, మించల బాలకృష్ణ యాదవ్, మన్నూరు సుదీర్ రెడ్డి, మాచినేని సుబ్బరామయ్య, పగడాల వెంకటేష్, బండారు శివ తదితరులు పాల్గొన్నారు.

# బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో హెచ్ఐవి కన్వర్జెన్సీ సమావేశం



**తాళ్లరేవు, ఆగస్టు 19, ( నేటి దర్శిని )** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని మండల కేంద్రమైన తాళ్లరేవులో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ,ఏఆర్టీ కేంద్రాలు,జిల్లా ఎయిడ్స్ నివారణ కంట్రోల్ యూనిట్ ప్రతినిధులు,ఫెడరేషన్ ప్రతినిధులు,ఆశా కార్యకర్తలు,గ్రామ సమైక్య సభ్యులకు సంప్రదింపుల కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల సమన్వయ సహకారంతో హెచ్ఐవితో బాధపడుతున్న వారికి నిరాటంక సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ కాలా ఆంజనేయులు మాట్లాడుతూ హెచ్ఐవి సోకిన వారికి వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు మరియు సేవలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీమాబాయి మహిళా మండలి మండల్ లెవెల్ ఇంప్లిమెంటరు డి అర్జున్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల సేవలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యకర జీవితాన్ని జీవించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ పరిధిలోని స్త్రీ పురుషులు మరియు బీమాబాయి మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

**-మరో మిత్రుడిని కోల్పోకూడదంటూ..**

**-ఉరవకొండలో యువత వినూత్న కార్యక్రమం**




**ఉరవకొండ రూరల్ ఆగస్టు 19, ( నేటి దర్శిని )** మత్తు పదార్థాల కారణంగా ఏ ఒక్క ప్రాణం బలికాకూడదనే లక్ష్యంతో ఉరవకొండలోని ఇందిరానగర్‌కు చెందిన కొందరు యువకులు బుధవారం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వ్యసనాలకు బానిసై యువత ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు తమను తీవ్రంగా కలచివేశాయని, ఇకపై మరో మిత్రుడిని కోల్పోకూడదనే ఆవేదనతో యువకులు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందిరానగర్‌కు చెందిన బషీర్ మరికొందరు యువకులతో కలిసి మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, ప్రత్యేకంగా ఫ్లెక్సీని రూపొందించారు. “మరో మిత్రుడిని కోల్పోకూడదు” అనే సందేశంతో రూపొందించిన ఈ ఫ్లెక్సీ ద్వారా యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు ఒక వ్యక్తి జీవితాన్నే కాకుండా మొత్తం కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తాయని యువకులు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా క్రీడలు, విద్య, ఉపాధి వంటి సానుకూల మార్గాల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. “మా స్నేహితుల్లో మరొకరిని కోల్పోయే పరిస్థితి రావద్దు.. మా బాధ మరొక కుటుంబానికి రాకూడదు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు అవగాహన కల్పించడమే మా లక్ష్యం” అని వారు తెలిపారు. సమాజంలో మార్పు రావాలంటే ప్రభుత్వాలు, పోలీసులు మాత్రమే కాకుండా ప్రజలు, ముఖ్యంగా యువత కూడా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ యువకుల ప్రయత్నం చాటిచెబుతోంది. తమ స్నేహితుడి జ్ఞాపకాన్ని బాధగా మిగిల్చుకోకుండా.. మరో ప్రాణాన్ని కాపాడాలనే సంకల్పంతో యువత ముందుకు రావడం స్థానికం గా చర్చనీయాంశంగా మారింది.

# అనుకున్న సమయానికే స్పిరిట్ విడుదల

## వాయిదా వార్తలను ఖండించిన టీమ్




ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' సినిమా వాయిదా పడనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అనుకున్న సమయానికే సినిమా విడుదలవుతుందని స్పష్టం చేసింది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే అదే సమయానికి సల్మాన్ ఖాన్ - వంశీ పైడిపల్లి కాంబోలో రానున్న సినిమా కూడా ఉండడంతో స్పిరిట్ విడుదల వాయిదా పడుతుందంటూ ప్రచారం మొదలైంది. 'స్పిరిట్' షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయనేది ఆ వార్తల సారాంశం. తాజాగా వీటిపై టీమ్ స్పందించింది. 'స్పిరిట్ విడుదలకు సంబంధించి ఎలాంటి మార్పూ లేదు. మేం కచ్చితంగా ప్రణాళిక ప్రకారమే ముందుకు వెళ్తున్నాం. ఈ చిత్రాన్ని మార్చి 5, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని క్లారిటీ ఇచ్చింది. ఈ మూవీలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో సందీప్ చూపించబోతున్నారట. త్రిప్తి దిమ్రీ కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

# ఓటిటిలోకి శ్రీనివాస మంగాపురం





తెలుగు సినీ పరిశ్రమలోకి సూపర్ స్టార్ కృష్ణ మూడో తరానికి చెందిన వారసుడిగా ఘనంగా అడుగుపెట్టారు జయకృష్ణ ఘట్టమనేని. దివంగత నటుడు రమేష్ బాబు తనయుడైన జయకృష్ణ హీరోగా, బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ నూతన నాయికగా టాలీవుడ్‌కు పరిచయమైన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. వైవిధ్యమైన చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ రొమాంటిక్ యాక్షన్ అండ్ రస్టిక్ డ్రామా ఇటీవలే థియేటర్లలో విడుదలై విజయవంతంగా ప్రదర్శించ బడుతోంది. అయితే ఈ సినిమా వచ్చి 20 రోజులు కూడా కాకముందే సినిమా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకున్నారు మేకర్స్. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ద్వారా ఆగస్టు 20 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు అత్యంత కీలకమైన పాత్రలో నటించగా, కోలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రతిష్టాత్మక వైజయంతి మూవీస్ సంస్థ సమర్పించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ.



రాశీఖన్నా హాట్ షో..

# వియత్నాం టూర్‌లో సమంత, రాజ్ నిడుమోరు



టాలీవుడ్ స్టార్ నటి సమంత ప్రస్తుతం వియత్నాంలో తన భర్త, ప్రముఖ దర్శక-నిర్మాత రాజ్ నిడిమోరు తో కలిసి బేబీమూన్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. త్వరలోనే తాము మొదటి బిడ్డకు స్వాగతం పలకబోతున్న నేపథ్యంలో, ఈ ప్రత్యేకమైన క్షణాలను ఆస్వాదించేందుకు ఈ క్యూట్ కపుల్ వియత్నాం వెకేషన్‌కు వెళ్లారు. అక్కడి సుందరమైన ప్రదేశాలను చుట్టేయడంతో పాటు, పలు రకాల ఫన్ యాక్టివిటీస్‌లో సమంత ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే అక్కడి ప్రత్యేకమైన స్థానిక ఫుడ్‌ను టేస్ట్ చేస్తూ ఎంజాయ్ చేసిన వీడియోలు, ఫోటోలను ఆమె సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ బేబీమూన్ పిక్స్ మరియు వీడియోలు నెట్టింట వైరల్ అవుతుండగా, టాలీవుడ్ ప్రముఖులు, అభిమానులు ఈ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.


# రామ్‌చరణ్‌కు జోడీగా?

బ్లాక్‌బస్టర్ 'రంగస్థలం' తర్వాత రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో రానున్న సినిమా కావడంతో '=జ 17' (వర్కింగ్ టైటిల్)పై షూటింగ్ ప్రారంభానికి ముందే అభిమానుల్లో అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఈ సినిమాలో కథానాయికగా రష్మిక మందన్నా, రుక్మిణీవసంత్‌ల పేర్లు మొన్నటివరకూ బలంగా వినిపించాయి. తాజాగా ఈ జాబితాలోకి 'దురంధర్' బ్యూటీ సారా అర్జున్ కూడా చేశారు. ఈ సినిమాలో కథానాయికగా సారా దాదాపు ఖరారైనదంటూ ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. నిజానిజాలు తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. వచ్చే నెలలో ఈ సినిమా పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నట్టు వినికిడి. హై ఓల్టేజ్ైస్టెలిష్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈచిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్ నిర్మించనున్నది. దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడు



# రాకాలో హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్

అగ్ర నటుడు అల్లు అర్జున్ హీరోగా, కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ బ్జడెట్ మూవీ 'రాకా'. హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్ ఈ సినిమాలో ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు సమాచారం. ఈ విషయంపై మేకర్స్ గతేడాది నుంచి చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనికి సంబంధించిన షూటింగ్ ప్రారంభం కానుందని సన్నిహిత వర్గాలు తెలిపాయి. అలాగే, షారుక్ ఖాన్ కూడా 'రాకా'లో భాగమేనని టాక్. విల్ స్మిత్, షారుక్, అల్లు అర్జున్ ఒకే ఫ్రేమ్‌లో వస్తే 'రాకా' భారీ సెన్సేషన్ మూవీ కావడం ఖాయమే. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో నలుగురు హీరోయిన్స్ ఉంటారని జోరుగా ప్రచారం జరుగుతోంది. జాన్వీ కపూర్, రష్మిక పేర్లు కూడా ఇటీవల తెరపైకి వచ్చాయి. దీనిపై టీమ్ స్పందించాల్సి ఉంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని పలు భాషల్లో 2027లో విడుదల చేయనున్నారు.





Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450